తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-02- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 215 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## రాజకీయ మనుగడ కోసం జలవివాదం

### వరుస ఎన్నికల్లో ఓటమితో తెరపైకి నీటి పంచాయితీ

- ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు
- బిఆర్ఎస్ హయాంలో నీటి వాటాలు వదులుకున్నారు
- కెసిఆర్, హరీష్ రావుల సంతకాలు బయటపెడతా
- కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడుతారు
- తెలంగాణ వాటాను మనం వాడుకోలేని దుస్థితికి తెచ్చారు
- అసెంబ్లీలో ఆరోగ్యకరమైన చర్చకు రావాలి
- 'నీళ్లు`నిజాలు' అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్
- మీడియాతో సిఎం రేవంత్ కీలక అంశాలు వెల్లడి



**హైదరాబాద్,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** పాలమూరు సహా అనేక విషయాల్లో గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు జలదోపిడీ అంటూ ఆ పార్టీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అండ్ కో తమ ప్రభుత్వంపై కావాలనే విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమానికి నీళ్లే ప్రధాన కారణమని తెలిపారు.నీటి వాటాలపై చర్చ దృష్ట్యా ప్రజాప్రతినిధులకు అవగాహన కోసం 'నీళ్లు`నిజాలు' అంశంపై ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలది సంకుచిత స్వభావమని విమర్శించారు. కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో



## సందడిగా మారిన లోక్‌భవన్

### గవర్నర్‌కు సిఎం, మంత్రుల శుభాకాంక్షలు

**హైదరాబాద్,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** న్యూ ఇయర్ సందర్భంగా లోక్‌భవన్‌లో వేడుకలు జరిగాయి. గవర్నర్ విష్ణు దేవ్ వర్మను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. దీంతో లోక్‌భవన్ సందడిగా మారింది. సిఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు కలిసి పుష్పగుచ్చం అందించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు ,హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్ కు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని , ప్రజలకు న్యాయవ్యవస్థ, ప్రభుత్వ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. పలువురు మంత్రులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి విషెస్ చెప్పారు. మంత్రులు వివేక్ వెంకటస్వామి, సీతక్క, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ గవర్నర్ కు పుష్ప గుచ్చం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సహా పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతలు గవర్నర్ కు విషెస్ చెప్పారు.




## ముంబైలో భారీగా బంగారం స్వాధీనం

### ఇద్దరు విదేశీ మహిళల వద్ద 32.79 కేజీల బంగారం పట్టివేత

**ముంబై,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** నగరంలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి దాదాపు 32.79 కేజీల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ బంగారం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.19.15 కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు వివరించారు. ఆఫ్రికన్ దేశాల నుంచి ఈ ఇద్దరు మహిళలు వచ్చారని చెప్పారు. వీరిద్దరు వేర్వేరుగా విదేశాల నుంచి వచ్చారన్నారు. ఛత్రపతి శివాజీ విమానాశ్రయంలో దిగిన వీరు..

7లో



## నెలరోజుల పాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు

### పోస్టర్‌ను ఆవిష్కరించిన మంతరి పొన్నం

**యాదాద్రి భువనగిరి,జనవరి1 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో నెల రోజుల పాటు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు` 2026 కొనసాగుతాయని రోడ్డు రవాణా శాక మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యాదగిరి గుట్టలో నేటి నుంచి ప్రారంభం కానున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2026 పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

మిగతా 2లో

## రెండేళ్లు గడిచినా హామీల అమలుపై నిర్లక్ష్యం

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపాటు
- బీఆర్ఎస్ డైరీని ఆవిష్కరించిన కేటీఆర్



**హైదరాబాద్,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** క్యాలెండర్లు మారుతున్నాయే తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఓటేసిన ప్రజల జీవితాల్లో మాత్రం ఎలాంటి సానుకూల మార్పు రాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రం అభివృద్ధి వైపు కాదు, తిరోగమనం వైపు ప్రయాణిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి నూతన సంవత్సర డైరీని కెటిఆర్ ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ప్రజలకు, భారతదేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ 2026 నూతన సంవత్సర సందర్భంగా భావోద్వేగభరిత ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులు, కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టకముందు ఉన్న దుస్థితి మళ్లీ రాష్ట్రానికి తిరిగి వస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా నేడు పండుగ వాతావరణంలో ఉన్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారని, చలి కాలంలో కూడా గంటల తరబడి, దినాల తరబడి లైన్లలో నిలబడాల్సిన దయనీయ పరిస్థితి కాంగ్రెస్ పాలనలో మళ్లీ వచ్చిందని విమర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేస్తూ, కేంద్రంతోనూ సమైక్యవాదులతోనూ 14 ఏళ్లు కేసీఆర్ నాయకత్వంలో సాగిన పోరాటాన్ని కేటీఆర్ స్మరించారు.

మిగతా 2లో



## న్యూ ఇయర్ వేడుకల్లో అపశృతి

### స్విస్ హోటల్‌లో పేలుడుకు 40మంది మృతి

**న్యూఢిల్లీ,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సరం వేళ స్విట్జర్లాండ్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ స్కీ రిసార్ట్ నగరం క్రాన్స్ మోంటానాలో ఓ బార్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 40 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు స్థానిక అధికారిక వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిరచాయి. మరో 100 మందికి గాయపడినట్లు తెలిపాయి. మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. బార్‌లో నూతన సంవత్సర వేడుకలు

7లో



## సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- మెదక్ ఎంపి రఘునందన్ డిమాండ్

**సిద్దిపేట,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** పెండిరగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కొత్త సర్పంచులకు నిధులను కేటాయించాలని విన్నవించారు. గురువారం అక్బర్‌పేట, భూంపల్లి మండలంలోని బొప్పాపూర్‌లో ఎంపీ రఘునందన్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మిగతా 2లో


## కొత్త సంవత్సరం రోజే అబద్ధాలతో షురూ

- హరీష్, కేటీఆర్‌పై ఎంపి చామల మండిపాటు

**హైదరాబాద్,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సరం తొలి రోజునే కేటీఆర్ గోబెల్స్ ప్రచారాన్ని మొదలు పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఓవైపు హరీష్ రావు.. మరోవైపు కేటీఆర్ కలిసి కాంగ్రెస ప్రభుత్వం, ప్రజా పాలనపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్ రావు..

మిగతా 2లో





## భారత్ సార్వభౌమాదికారాన్ని తక్కువ చేసే యత్నం

### చైనా తీరుపై మండిపడ్డ ఎంపి అసదుద్దీన్

**హైదరాబాద్,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలను తొలగించేందుకు తమ దేశం మధ్యవర్తిత్వం వహించిందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ పేర్కొనడాన్ని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఖండిరచారు. చైనా చేసిన ఆ వ్యాఖ్యలపై తన సోషల్ మీడియా పోస్టులో స్పందించారు. ఇండోపాక్ ఉద్రిక్తతలను తగ్గించినట్లు చైనా చెప్పడం అవమానకరమని, ఆ వ్యాఖ్యలకు కేంద్ర సర్కారు గట్టి బదులు ఇవ్వాలని అన్నారు.

మిగతా 2లో



## ఎక్సైజ్ శాఖకు న్యూ ఇయర్ కిక్కు

### భారీగా సాగిన మద్యం అమ్మకాలు
### డిసెంబరులో రూ.5,102 కోట్ల మద్యం విక్రయం

**హైదరాబాద్,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో మద్యం అమ్మకాలకు నూతన సంవత్సర జోష్ మరింత కిక్కిచ్చింది. మంగళ, బుధవారాలు రెండు రోజుల్లో ఏకంగా రూ.750 కోట్లకుపైగా మద్యం విక్రయాలు జరిగాయి. డిసెంబరు నెలలో మొత్తమ్మీద రూ.5,102 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబరు నెలకు సంబంధించి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ చరిత్రలో అమ్మకాలు,

2లో

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రాజకీయ మనుగడ కోసం జలవివాదం

(మొదటి పేజీ తరువాయి)



గురువారం నదీ జలాల అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రజంటేషన్‌కు హాజరై ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ఏపీ ప్రభుత్వంపై తీవ్ర వత్తిడి తెస్తున్నామని చెప్పుకొచ్చారు. గతంలో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మరణశాసనంగా మారాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ నీటి చౌర్యం చేస్తున్న.. తెలంగాణ వాటాను మనం వాడుకోలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కమీషన్ల కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి ఆ ప్రాజెక్టును మార్చారని మండిపడ్డారు. తల వదిలేసి తోక దగ్గర నీళ్లు తెచ్చేలా ప్రాజెక్టు డిజైన్ చేశారని విమర్శించారు. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల ఒప్పందాన్ని కేసీఆర్ చేశారని ఆరోపణలు చేశారు. ఏపీకి 66శాతం నీళ్లు శాశ్వత హక్కు వచ్చేలా కేసీఆర్ సంతకం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ నీటి లెక్కలు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదం సృష్టించి.. తద్వారా లబ్ది పొందాలని భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా నీళ్ల హక్కుల కోసమే తెలంగాణ ఉద్యమం జరిగింది. కృష్ణా, గోదావరి జలాలను సక్రమంగా వాడుకుంటే ఎంతో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచి ఉండేది. నీళ్ల కోసం ఉమ్మడి రాష్ట్రంలో పీజేఆర్ స్వంత ప్రభుత్వాన్ని నిలదీశారు. గతంలో నీళ్ల విషయంలో ఎన్నో పొరపాట్లు జరిగాయి. ఆ పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ఉమ్మడి ఏపీకి కృష్ణా జలాల్లో 811 టీఎంసీలు కేటాయించారు. రాష్ట్రం విడిపోయినప్పుడు కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు అని చెప్పారు. తెలంగాణకు 299 టీఎంసీలు చాలని అంగీకరిస్తూ పదేళ్ల
కాలానికి కేసీఆర్ సంతకం చేశారు. కేసీఆర్ పెట్టిన సంతకం ఏపీకి అడ్వాంటేజ్‌గా మారింది. అప్పుడు ఏపీకి 66శాతం, తెలంగాణకు 34 శాతం జలాలకు ఆయన అంగీకరించారు. తదుపరి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు రాకుండా వాయిదా వేయిస్తున్నారు. నదీపరివాహకం ప్రకారం చూస్తే.. కృష్ణా జలాల్లో తెలంగాణకు 71శాతం రావాలి. నదీ పరివాహకం ప్రకారం జలాలు కావాలని వాదించాల్సి ఉండగా.. కేసీఆర్ అలా అడగలేదు. కృష్ణాలో 299 టీఎంసీలకు కేసీఆర్ అంగీకరించారని ఇవాళ కేఆర్ఎంబీ అంటోంది.
బీఆర్ఎస్ మనుగడ కష్టమని కేసీఆర్ గుర్తించారు.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పరాజయం పాలైంది. ఎన్నికల్లో వరుస ఓటములతో భారత రాష్ట్ర సమితి మనుగడ కష్టమవుతోందని కేసీఆర్ గుర్తించారు. మళ్లీ జలవివాదం రేపి, ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాల సృష్టించి తన పార్టీని బ్రతికించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. దాంట్లో భాగంగా ఒక అబద్ధాల సంఘాన్ని ఏర్పాటుచేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పార్టీని బతికించుకునేందుకు మళ్లీ నీళ్ల సెంటి మెంట్‌ను వాడుకుంటున్నారు. చంద్రబాబు పేరు చెప్పి తెలంగాణలో మళ్లీ పార్టీని బతికించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు‘ అని సీఎం విమర్శించారు.
పాలమూరు `రంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్ ఏడేళ్ల వరకు డీపీఆర్ సమర్పించలేదు. డీపీఆర్ రూపొందించకుండానే రూ.27వేల కోట్లు ఖర్చు చేశారు. డీపీఆర్ రూపొందించలేదు కాబట్టి.. పర్యావరణ అనుమతులు కూడా రాలేదు. అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేశారు. సుప్రీంకోర్టులో కేసులు వేయడంతో పాలమూరు `రంగారెడ్డి ప్రాజెక్టు సాగునీటి ప్రాజెక్టు కాదని అఫిడవిట్ వేశారు. తాగునీటి కోసం 7.15 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కోర్టుకు చెప్పారు. కమిషన్ల కోసం పంపులు, లిఫ్టుల కంపెనీలకు రూ.27వేల కోట్లు చెల్లింపులు చేశారు. ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా అయితేనే కమిషన్లు భారీగా వస్తాయని కేసీఆర్ కుట్ర చేశారు. పాలమూరు `రంగారెడ్డి ప్రాజెక్టుకు జూరాల నుంచి నీటిని తీసుకునేలా రూపొందించారు. జూరాల నుంచి అయితేనే లిఫ్ట్‌లు ఎక్కువ పెట్టలేమని భావించిన కేసీఆర్ దాన్ని శ్రీశైలానికి మార్చారు. తల దగ్గర నుంచి నీరు తీసుకునేది వదిలేసి తోక దగ్గర నీళ్లు తీసుకునేలా డిజైన్ చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 0.25 టీఎంసీలు మాత్రమే తీసుకునే దుస్థితి ఏర్పడిరది. ఏపీ ప్రభుత్వం మాత్రం రోజుకు 13 టీఎంసీలు తరలించేలా ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నది. ఏపీలో పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా నియమించుకున్నారని ఆరోపిస్తున్నారు. ఆయనకు తెలంగాణలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నది. కేసీఆర్‌కు ఆహ్వానం పలుకుతున్నా.. శాసనసభలో చర్చ చేద్దాం రండి. సభలో మంచి సంప్రదాయాన్ని నెలకొల్పుదాం అని సీఎం అన్నారు. ఇదిలావుంటే పాలమూరు `రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.80 వేల కోట్లు అవసరమని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినట్లు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చెప్పిందన్నారు. నీటి వాటాలపై అసెంబ్లీలో శుక్రవారం చర్చ జరగనున్న దృష్ట్యా ’నీళ్లు `నిజాలు’ అంశంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కోసం మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఏపీ చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు, ఇతరపథకాలపై ఉత్తమ్ వివరణ ఇచ్చారు. పాలమూరు ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం రూ. 27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.80 వేల కోట్లకుపైగా కావాలి. రూ. 80వేల కోట్ల ప్రాజెక్టుపై రూ.27వేల కోట్లు ఖర్చు చేస్తే 90 శాతం పూర్తయినట్టా?
మేం వచ్చాక రూ.7 వేల కోట్లు ఖర్చు చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి తీయలేదని ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోందని ఉత్తమ్ మండిపడ్డారు.



# నెలరోజుల పాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రతి పౌరుడు రోడ్డు భద్రత మాసోత్సవ అవగాహన సదస్సులో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ సమన్వయంతో ప్రతి విద్యార్థి దగ్గర, వారి తల్లిదండ్రుల నుండి
రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తామనే హామీ పత్రం తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పాఠశాల రోడ్ సేఫ్టీ క్లబ్‌లో చేరాలని సూచించారు. భవిష్యత్ అంతా రోడ్ సేఫ్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ ప్రయత్నం జరుగుతుందని వివరించారు. నిన్న రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ అధికారులు విడుదల చేసిన నివేదికల్లో అనేక మరణాలు రోడ్డు ప్రమాదాల వల్లే జరుగుతున్నాయని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రవాణా శాఖ పక్షాన తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు , రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.



# సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఓపెన్ జిమ్, బాలవికాస వాటర్ ప్లాంట్, సోలార్ స్ట్రీట్ లైట్లను సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్, పాలకవర్గంతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. మహాత్మా గాంధీ కళలు కన్నా గ్రామస్వరాజ్యం సాధించాలని పాలకవర్గానికి సూచించారు. తన పార్లమెంట్ పరిధిలో ఎప్పుడు, ఏ సమస్య వచ్చిన 24 గంటలు తాను అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. వ్యక్తిగత రీత్యా కూడా గ్రామపంచాయతీల ఏర్పాటుకు కృషి చేస్తానని మాటిచ్చారు. బొప్పాపూర్ గ్రామ పంచాయతీ, ఐకేపీ సెంటర్లో లైట్లు, రోడ్ల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటిపై సోలార్‌ను ఏర్పాటు చేసుకుని కరెంట్ ఆదా చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు ఎంపీ రఘునందన్ రావు. మూడున్నరేళ్లలో సోలార్ నుంచి కరెంట్ తయారీ చేసేలా చూడాలని నిర్దేశిరచారు. ఎనగుర్తి నుంచి శిలాజీ నగర్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద ’మన ఊరు `మన బడి’ నిధుల్లేవని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సర్పంచులు పనిచేసిన బిల్లులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేసే ప్రతి పథకాన్ని ఇక్కడ కూడా అమలు చేసేలా పాలకవర్గం చర్యలు తీసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు సూచించారు.

# రెండేళ్లు గడిచినా హామీల అమలుపై నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 ఏళ్ల పాటు కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిందని, ఆ ప్రగతి సంతకాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరని స్పష్టం చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని కేటీఆర్ కొనియాడారు. జెండాను చేతబట్టి నడిపించే నాయకుల కంటే, ఆ జెండాను భూమిలో నిటారుగా పాతి ‘ఇది నా జెండా‘అని గర్వంగా చెప్పే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని కేటీఆర్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ప్రతి పోరాటం వరకు లగచర్లలో గిరిజనులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన తీరుకు వ్యతిరేకంగా, రైతుబంధును రెండు సార్లు ఎగ్గొట్టిన అన్యాయంపై, ’ఆరు గ్యారంటీలు ? 420 హామీలు’పై ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన కార్యకర్తలను కేటీఆర్ అభినందించారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న దాష్టీకానికి వ్యతిరేకంగా గళమెత్తిన సోదరులను, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల ఆక్రమణకు నిరసనగా నిలిచిన విద్యార్థులను, రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి అన్యాయానికి ఎదురు నిలుస్తున్న తెలంగాణ తమ్ముళ్లను, ఆడబిడ్డలను ఆయన ప్రత్యేకంగా స్మరించారు. 2026వ సంవత్సరంలోకి
అడుగు పెడుతున్న ఈ శుభసందర్భంలో ఒకటే విషయం గుర్తుంచుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గెలుపులు, ఓటములు శాశ్వతం కావని, అవి తాత్కాలికమని, అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు తగులుతాయని, కానీ తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం, గులాబీ జెండా స్థానం మాత్రం శాశ్వతమని స్పష్టం చేశారు. ఇతర పార్టీలకు తెలంగాణ రాజకీయాలు ఒక ఆటలా ఉంటే, తెలంగాణ సాధించిన బీఆర్ఎస్‌కు రాజకీయాలు ప్రజల సంక్షేమానికి సంబంధించిన ధర్మమని, ఒక విధి అని కేటీఆర్ తెలిపారు. గెలుపు `ఓటములతో సంబంధం లేకుండా పార్టీ ప్రయాణం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఈ ఏడాది ఒక వైపు పోరాటాన్ని కొనసాగిస్తూనే, మరో వైపు పటిష్టమైన సంస్థాగత నిర్మాణం కూడా అవసరమని కేటీఆర్ స్పష్టం చేశారు. పోరాటం, నిర్మాణం రెండిరటినీ ఆధారంగా చేసుకుని ముందుకు సాగాలని, ధర్మం, న్యాయం, నిజాయితీ తమవైపే ఉన్నాయని, అందుకే విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్రం కలిసి రెండు పార్టీలు ఒకటై బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ, ప్రజల ఆశీర్వాదం, దైవ ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎవరూ ఏమీ చేయలేరని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగినా బీఆర్ఎస్‌ను అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. చివరగా 2028లో తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడటమే బీఆర్ఎస్ లక్ష్యమని, అదే తమ ధ్యేయమని స్పష్టం చేస్తూ, చిన్నచిన్న ఎదురుదెబ్బలను పెద్దగా పట్టించుకోకుండా జాగ్రత్తగా ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# కొత్త సంవత్సరం రోజే అబద్ధాలతో షురూ

(మొదటి పేజీ తరువాయి)



కృష్ణా, గోదావరి నదీ జలాలు, పాలమూరు `రంగారెడ్డి ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని.. కేటీఆర్ వచ్చి రైతులకు యూరియా సరఫరాపైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై వాస్తవాలు మాట్లాడాలని.. తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు భూస్థాపితం చేశారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించి గుండు సున్నా తెచ్చుకుందని ఎద్దేవా చేశారు ఎంపీ చామల. రైతులకు యూరియా కోసం ధర్నాలు చేశామని.. కేంద్ర మంత్రి నడ్డాతో మాట్లాడి యూరియా తెప్పించామన్నారు ఎంపీ చామల. 2024`2025 సంవత్సరానికి వానాకాలం పంటకు 9.66 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణ రాష్ట్రానికి తెప్పించామన్నారు. యాసంగికి 10.41 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తీసుకువచ్చామని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఈ స్థాయిలో ఎప్పుడూ యూరియా తేలేదన్నారు. 2025`2026 వానాకాలం పంటకు 9.79 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తెచ్చామని.. యూరియాను తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా ఫెయిల్ కాలేదన్నారు ఎంపీ. లెక్కలు ప్రజలు తెలుసుకోలేరని కేటీఆర్ జనవరి 1వ తేదీ నుంచే అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేటీఆర్ తప్పుడు సమాచారంతో, తప్పుడు మాటలతో తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టొద్దన్నారు.

# భారత్ సార్వభౌమాదికారాన్ని తక్కువ చేసే యత్నం

(మొదటి పేజీ తరువాయి)

భారతీయ హుందాతనాన్ని, సార్వభౌమత్వాన్ని చైనా తక్కువ చేసి మాట్లాడడం సరికాదు అన్నారు. ఆపరేషన్ సింధూర్ వేళ ఇండోపాక్ మధ్య తీవ్ర సంక్షోభం నెలకొన్నదని, వాణిజ్య బెదిరింపులతో శాంతి నెలకొల్పినట్లు ట్రంప్ చెప్పారని, ఇప్పుడు చైనా మంత్రి కూడా ఇలాంటి ప్రకటన చేయడం భారత్‌ను కించపరచడమే అవుతుందని ఓవైసీ అన్నారు. చైనా వ్యాఖ్యలను భారత్ బలమైన రీతిలో వ్యతిరేకించాలన్నారు. భారత్, పాకిస్థాన్ దేశాలను ఒకే స్థాయిలో పెట్టి, దక్షిణాసియాలో మేటి దేశంగా మార్కులు కొట్టేసేందుకు చైనా ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. చైనా పర్యటనకు వెళ్లిన సమయంలో ప్రధాని మోదీ ఈ విషయాన్నే అంగీకరించారా అని నిలదీశారు. ఇండోపాక్ సమరాన్ని మధ్యవర్తిత్వం ద్వారా ఆపినట్లు చైనా చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం అధికారికంగా ఆ వ్యాఖ్యలను ఖండిరచాలని, మూడవ దేశం జోక్యం చేసుకోలేదన్న విషయాన్ని చెప్పాలని ఓవైసీ కోరారు.



# రోడ్డు నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యం..!





- సత్తుపల్లి డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం.
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ ప్రదీప్.

**సత్తుపల్లి, జనవరి 1 (తెలంగాణ ముచ్చట్లు-):** ప్రతి వాహనదారుడు పూర్తి ఏకాగ్రతతో వాహనం నడుపుతూ రోడ్డు నియమాలను విధిగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సత్తుపల్లి ఎస్ఐ ప్రదీప్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి వాహనదారుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రత్యేకించి భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు మరింత అప్రమత్తతతో, ఏకాగ్రతతో వాహనాలు నడిపితే ప్రమాదాల అవకాశాలు చాలా మేర తగ్గుతాయని పేర్కొన్నారు. రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా డ్రైవర్లకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఊటుకూరి సునీత మాట్లాడుతూ, ప్రతి డ్రైవరు సరైన నిద్ర, సరైన ఆహారం తీసుకుని శారీరకంగా, మానసికంగా సిద్ధంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. "భద్రంగా డ్రైవ్ చేయండి - సురక్షితంగా ఉండండి" అనే సందేశాన్ని ఆమె డ్రైవర్లకు ఇచ్చారు. కుడి వైపు నుంచే వాహనాలను దాటాలని, మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని ఆమె హెచ్చరించారు. ఎదురుగా వచ్చే వాహనాలను జాగ్రత్తగా గమనిస్తూ అప్రమత్తంగా వాహనం నడపాలని సూచించారు. ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, పూర్తి ఏకాగ్రతతో డ్రైవింగ్ చేస్తూ రోడ్డు భద్రతకు సహకరించాలని ఆమె కోరారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి. విజయశ్రీ, వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సైదిరెడ్డి, ఏడీసీలు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు టీజేఎఫ్ అండగా ఉంటుంది





- టి యు డబ్ల్యూ జే టిజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ
- ఖమ్మం ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా గుద్దేటి రమేష్ బాబు తిరిగి రెండోసారి ఎన్నిక
- అట్ట హాసంగా న్యూ ఇయర్ వేడుకలు

**ఖమ్మం బ్యూరో,జనవరి 1(తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టులకు ఏ కష్టం వచ్చినా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టిజెఎఫ్ అండగా ఉంటుందని యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుతోటి ఆదినారాయణ అన్నారు. నూతన సంవత్సర సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం న్యూ ఇయర్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీజేఎఫ్ )జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి హాజరయ్యారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు న్యూ ఇయర్ కేక్ ను కట్ చేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు.

అనంతరం ప్రెస్ క్లబ్ కమిటీ (టీజేఎఫ్) మహాసభ గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చిన ఎంతటి కష్టం వచ్చినా తమ యూనియన్ అండగా నిలుస్తుందని అన్నారు. ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్లు, హెల్త్ కార్డుల ఇతర జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో పాలక పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయని, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం చేసే ఉద్యమాలలో తమ యూనియన్ ముందుంటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో జరగబోయే ఆందోళన కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... ప్రెస్ క్లబ్ కమిటీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో ప్రెస్ క్లబ్ సుందరంగా రూపు దిద్దుకుందని ఇదే సమిష్టి కృషితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా గుద్దేటి రమేష్ బాబు తిరిగి రెండోసారి ఎన్నిక

గురువారం జరిగిన ప్రెస్ క్లబ్ కమిటీ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ (టీజేఎఫ్) కమిటీ అధ్యక్షులుగా గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా కొరకొప్పల రాంబాబు, కోశాధికారి బిక్కీ గోపి తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ముత్యాల కోటేశ్వరరావు, పోన్నెబోయిన పానకాలరావు, వి5 యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్ .వెంకట్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా , మూల జీవన్ రెడ్డి, ఉల్లోజు రమేష్, దండాల ప్రభాకర్ రెడ్డి, ప్రచార కార్యదర్శులుగా నల్లమోతు శ్రీనివాస్, కూరపాటి నరేష్, పులి శ్రీను, ఈసీ మెంబర్లుగా ఎ .మురళి, లక్ష్మణ్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, శంకర్,అప్పారావు, విశ్వ సేన రవీందర్, రోసి రెడ్డి, శ్రీధర్, రాజేంద్రప్రసాద్ తోపాటు మొత్తం 21 మందితో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మందులు ఉపేందర్, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వర రావు, సంతోష్, మహిళ ప్రతినిధి వంగూరి ఈశ్వరి, గోవింద్ ,నాయకులు పెంటి వెంకటేశ్వర్లు, వేణుగోపాల్,నాగరాజు, ఐలయ్య, ప్రసాద్, ఆదినారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# జేవీఆర్ఓసీ-2లో కార్మికులకు పదోన్నతులు





- నూతన సంవత్సర వేడుకల్లో ఉత్తర్వుల అందజేత.



**సత్తుపల్లి, జనవరి 1 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి-కొత్తగూడెం ప్రాంతానికి చెందిన జేవీఆర్ఓసీ-2లో పనిచేస్తున్న కార్మికులకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పదోన్నతులు కల్పించారు. సర్వీస్‌లో ఎనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న 27 మంది కార్మికులకు సేవా ఆధారిత పదోన్నతులు మంజూరు చేశారు. అలాగే టైం రేటెడ్ ఖాళీల విధానం ద్వారా పంపు నిర్వాహకులు ముగ్గురికి, కన్వేయర్ నిర్వాహకులు ఎనిమిది మందికి పదోన్నతులు ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సత్తుపల్లి ప్రాంత ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పదోన్నతుల ఉత్తర్వులను కార్మికులకు అందజేశారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి కార్మికులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్, ప్రాజెక్టు ఇంజినీరు డి. శ్రీనివాసరావు, జేవీఆర్ఓసీ నిర్వహణాధికారి బి. రాజేశ్వరరావు, జి. కళ్యాణ్ రామ్, వెల్ఫేర్ ఆఫీసర్లు దార కావ్య, కాశబోయిన శ్రీనివాస్, ఏఐటీయూసీ శాఖ కార్యదర్శి ఎస్.సుధాకర్, ఐఎన్‌టీయూసీ (ఫిట్) కార్యదర్శి ఎన్.రామారావు, అలాగే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రగతి సారథికి 'నవ' శుభాకాంక్షలు



- సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం బ్యూరో, జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నూతన సంవత్సర సందడి ఉప్పొంగింది. నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టిన వేళ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇద్దరు నేతలు ఆత్మీయంగా కరచాలనం చేసుకుని, కొత్త ఏడాదిలో ప్రజా పాలనను మరింత ఉన్నత శిఖరాలకు చేర్చాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## జనవరి 3న జాబ్ మేళా నిర్వహణ..

- జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్



**ఖమ్మం బ్యూరో,జనవరి -01(తెలంగాణ ముచ్చట్లు) :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వరుణ్ మోటార్స్, ఖమ్మం నందు ఉద్యోగాలు కల్పించుటకు జనవరి 3న శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్, ఖమ్మం సంస్థలో 105 సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 5 టెక్నిషియన్, 2 ట్రైనీ డెంటర్, 6 టెలీ కాలర్ సర్వీస్ (మహిళలు మాత్రమే), 5 సర్వీస్ అడ్వైజర్, 1 వారంటీ కో ఆర్డినేటర్, 1 స్పార్స్ పికర్, 5 సెక్యూరిటీ, 3 వాటర్ వాషర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్ కు ఏదైనా డిగ్రీ, టెక్నీషియన్ పోస్టులకు ఐటిఐ, టెలి కాలర్ సర్వీస్, స్పార్స్ పికర్, సెక్యూరిటీ పోస్టులకు ఇంటర్ /డిగ్రీ, ట్రైనీ డెంటర్ కు పదవ తరగతి/ఇంటర్, సర్వీస్ అడ్వైజర్, వారంటీ కోఆర్డినేటర్ పోస్టులకు డిప్లమా/బీటెక్ విద్యార్హతలు కలిగి ఉండాలని అన్నారు. ఆసక్తి ఉన్నవారు జనవరి 3న శనివారం తమ సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో వరుణ్ మోటార్స్, ప్రగతి స్కూల్ ఎదురుగా, ఇండస్ట్రియల్ ఏరియా, ఇల్లందు రోడ్, ఖమ్మం నందు నిర్వహించు జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9281107531 ఫోన్ నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా నిల్వలు..

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో, జనవరి-01(తెలంగాణ ముచ్చట్లు):** సాగు చేసే రైతులకు సరిపడా యూరియా స్టాక్ జిల్లాలో అందుబాటులో ఉందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేసేందుకు అన్ని మండలాల్లో సమగ్ర చర్యలు చేపట్టామని, మార్క్ ఫెడ్ ద్వారా యూరియా నిల్వలను ప్యాక్స్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు), ప్రైవేట్ డీలర్లకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం మన ఖమ్మం జిల్లాలో 13 వేల 453 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, ఇప్పటివరకు రైతులకు 22 వేల 472 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. యూరియా పంపిణీ సంబంధిత అంశాలలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, జిల్లా యంత్రాగం, జిల్లా వ్యవసాయశాఖ యూరియా సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఎటువంటి సమస్యలు ఉన్నా, మీ మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ , పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, జనవరి 1(తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సరం సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు శ్రీ వేం నరేందర్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం మరింత విజయవంతం కావాలని పరమేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. వేం నరేందర్ రెడ్డి కూడా శుభాకాంక్షలు స్వీకరిస్తూ, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హనుమంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్స రెడ్డి, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా కాప్రా సర్కిల్ పరిధిలో చెరువుల శుభ్రత కార్యక్రమం

**కాప్రా, జనవరి 01 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా మున్సిపాలిటీ లో స్వచ్ఛ సర్వేక్షన్ షెడ్యూల్ మరియు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా చెరువులు, నాళాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకు కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా చెరువు, చర్లపల్లి, నాచారం హెచ్ఎంటి చెరువు ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, ఎంటమాలజీ విభాగం సిబ్బంది కలిసి చెత్తాచెదారం తొలగించడంతో పాటు, పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్కన్‌ను పూర్తిగా తొలగించారు. దీంతో చెరువుల పరిసరాలు శుభ్రంగా మారడంతో పాటు దోమల పెరుగుదలను నియంత్రించే దిశగా చర్యలు తీసుకున్నారు.ఈ శుభ్రత కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్, డీస్విమ్ ఎ. రవి, ఏఈ వెన్నెల, శానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్ రామకృష్ణ, ప్రభాకర్, రామకృష్ణ, సుమేష్, శ్రీనివాస్, జగన్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.అలాగే ఎస్ఎఫ్ఏలు వసంత, లక్ష్మి, ఏకస్వామి, రాజేష్, నరేష్, రాజ్‌కుమార్, అంజలి, గోవర్ధన్ రెడ్డి, సతీష్, లక్ష్మీ నరసయ్య, లలిత, స్వప్న, పద్మభూలక్ష్మి, శ్యామల తదితరులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# కాప్రా వీరశైవుల క్యాలెండర్ ఘన ఆవిష్కరణ



**కాప్రా, జనవరి 01 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా వీరశైవుల నూతన సంవత్సరం-2026 క్యాలెండర్‌ను గురువారం కాప్రా విజయ హైస్కూల్ ప్రాంగణంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సెంట్రల్ కమిటీ సభ్యులు కొప్పునూరి బసప్ప, రాష్ట్ర అధ్యక్షులు దినేష్ పాటిల్,రాష్ట్రసంఘం క్రమశిక్షణసంఘం చైర్‌పర్సన్ కర్లీ రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రాచప్ప ముఖ్య అతిథులుగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కోకాపేట్‌లో నిర్మిస్తున్న భవనానికి 'వీరశైవ లింగాయత్ లింగ బలిజ బసవ భవన్' అని నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి జిల్లా, మండల స్థాయిలో వీరశైవుల కోసం ప్రత్యేక సామాజిక భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. కాప్రా సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మహాత్మా బసవేశ్వర విగ్రహ నిర్మాణానికి రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతు ప్రకటించింది. వీరశైవ సమాజం ఐక్యతతో ముందుకు సాగుతూ సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాప్రా సమాజం గౌరవ అధ్యక్షులు యావపురం విశ్వనాథం,అధ్యక్ష-కార్యదర్శులు ప్యాట్ జ్ఞానేశ్వర్, గంగా ఈశ్వరయ్య, దిశాయి బండే గౌడ, కాప్రా కాలనీల సమాఖ్య ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, వీరశైవ సమాజం సభ్యులు కత్తి శివానంద్, సిద్దేశ్వర, రాజేశ్వర్, మస్కరి శివ, జగదీష్, సాయి, రామ్ శెట్టి, చంద్రశేఖర్, మటం శివ, యావపురం రవి, గంగా శివ తదితరులు పాల్గొన్నారు.




# 325 జర్నలిస్టు కుటుంబాల నివాస హక్కు కోసం రాజీలేని పోరాటం

- రాజ్యాంగపు నాలుగో స్తంభానికి గూడు లేదనటం భావ్యమా?
- నూతన సంవత్సరంలో మంత్రుల మనసులు మారాలని ఆకాంక్ష
- న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదని టిడబ్ల్యూజేఎఫ్ స్పష్టం

**ఖమ్మం బ్యూరో,జనవరి 1(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాస్వామ్యానికి కాపలాదారులుగా నిలిచే జర్నలిస్టులకే నేడు నివాస భద్రత లేకపోవడం అత్యంత దురదృష్టకరమని, ఖమ్మంలోని 325 జర్నలిస్టు కుటుంబాల నివాస హక్కు సాధించే వరకు రాజీలేని పోరాటం కొనసాగుతుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్ చక్రవర్తి స్పష్టం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో ఆయన జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు. నూతన సంవత్సరం కేవలం క్యాలెండర్ మార్పు మాత్రమే కాదని, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం మరింత దృఢమైన ఉద్యమాలకు నాంది కావాలని ఆయన అన్నారు. ఖమ్మం జిల్లాలో అర్హులైన 325 మంది జర్నలిస్టులకు 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయడం సహించేది లేదని హెచ్చరించారు. ఇళ్ల స్థలాల అంశంలో పాలకులను, అధికారులను నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం సాగుతున్న పోరాటం రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, వ్యక్తిగత లాభాల కోసం కూడా కాదని సంతోష్ చక్రవర్తి స్పష్టంగా తెలిపారు. ఇది సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టుల జీవన భద్రత, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం సాగిస్తున్న న్యాయ పోరాటమని అన్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవకుండా కొనసాగితే ప్రశ్నించడం జర్నలిస్టు వృత్తి బాధ్యతేనని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కోశాధికారి అరవపల్లి నగేష్ జన్మదిన వేడుకలను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ గారికి జిల్లా అధ్యక్షుడు నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఐక్యంగా, సంఘటితంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని టిడబ్ల్యూజేఎఫ్ నాయకత్వం స్పష్టం చేసింది.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, ఉపాధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, అమరబోయిన ఉపేందర్, కాసోజు శ్రీధర్, సుధాగాని కరుణాకర్, కప్పల మధు గౌడ్, కందరపోయిన నాగకృష్ణ, సంతోష్, సతీష్, కొదుమూరి భద్రయ్య, ఎలుగోటి వెంకట్, కరాటే వేణు, నాయిని స్వాతి, రాంబాబు, తుమ్మలపల్లి శ్రీనివాస్, షేక్ సోందుమియా, మల్లెల శిల్ప, కుంభం రవికుమార్, మణిదీప్, దిలీప్, తనుష్, వివేక్, నవీన్, అవినాష్, షకీల్, విగ్నేష్, నరేందర్, స్వర్ణ కుమార్, కాశీరాం, అఖిల్, రఫీ, భూక్య విగ్నేష్, అశోక్, సందీప్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నోటరీగా పెద్దబోయిన రామ నరసింహా రావు



**సత్తుపల్లి, జనవరి 1 (తెలంగాణ ముచ్చట్లు):** కల్లూరుకు చెందిన సీనియర్ న్యాయవాది పెద్దబోయిన రామ నరసింహా రావును కేంద్ర ప్రభుత్వ నోటరీగా కేంద్ర న్యాయ శాఖ నియమించింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.పెద్దబోయిన రామ నరసింహా రావు గతంలో సత్తుపల్లి కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా సేవలందించి న్యాయరంగంలో విశేష అనుభవాన్ని సంపాదించారు. న్యాయ సేవలలో ఆయన చూపిన నిబద్ధత, వృత్తిపరమైన ప్రతిభకు గుర్తింపుగా ఈ నియామకం జరిగిందని న్యాయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నియామకంపై న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేశారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



- కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీలు వజ్రేష్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, జనవరి 1(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని , మేడ్చల్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీలు , తోటకూర వజ్రేష్ యాదవ్,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఈ భేటీలో సీఎంను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా , మేడ్చల్ జిల్లా, ఉప్పల్ నియోజకవర్గం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై సీఎంకు వివరించారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్య సమస్యలు, విద్యావైద్య రంగాల అభివృద్ధి అంశాలను సీఎంను దృష్టికి తీసుకువచ్చారు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# మౌంట్ జియన్ మినిస్ట్రీస్‌లో ఘనంగా ఆంగ్ల నూతన సంవత్సర ఆరాధనలు



**కాప్రా, జనవరి 01(తెలంగాణ ముచ్చట్లు):** మౌంట్ జియన్ మినిస్ట్రీస్‌లో 2026వ ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఆరాధనలకు సంఘ కాపరి రెవ. కే. ఊర్మిళ ఆనంద్ నాయకత్వం వహించారు.కార్యక్రమం ప్రారంభంలో మినిస్ట్రీస్ ఫౌండర్ ప్రెసిడెంట్ లేట్ రెవ. కే. జాన్ విలియం మినిస్ట్రీని స్థాపించిన విధానం, ఆయన చేసిన సేవలను ఆయన సతీమణి ఏస్తేరమ్మ వివరించి ప్రార్థన ప్రారంభించారు .ఈ ఆరాధన కార్యక్రమంలో సంఘ పెద్దలు, వృద్ధులు, యువనస్తులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు భక్తి గీతాలతో దేవుని ఆరాధించారు. గత సంవత్సరం దేవుడు అందించిన రక్షణ, ఆశీర్వాదాలను గుర్తుచేస్తూ, నూతన సంవత్సరంలో దేవుని మార్గంలో నడవాల్సిన విధానాన్ని సంఘ కాపరి పరిశుద్ధ గ్రంథం ఆధారంగా బోధించారు.ఆరాధన అనంతరం కేక్ కట్ చేసి, ఆనందోత్సాహాల మధ్య ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు నర్సింగ్ రావు, కే. మరీ, కే. ఆనంద్ కుమార్, సుధా, టీ. సౌజన్య, ప్రవీణ్, తేజు, మేరీపవిత్ర పాల్, కే. స్టీఫెన్, సౌమ్య, కే. స్టెల్లా, షారణ్య, మమతా, విద్య, ఏంజెల్ నేరయ్య, స్టెన్సీ, నిది జాన్, చిన్న అమ్ములు, శ్రేష్ఠ, చిన్నాయా తదితరులు పాల్గొన్నారు.

# టీజీ టెట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్




**ఖమ్మం బ్యూరో, జనవరి 1(తెలంగాణ ముచ్చట్లు):** జనవరి 3 నుండి జనవరి 20 వరకు ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని పరీక్ష కేంద్రాలలో నిర్వహించే టీజీ టెట్ప రీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 7:30 గంటల నుండి సాయంత్రం 6:00 వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు ముసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తుతో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## హరీష్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే



◆ బీఆర్ఎస్ నాయకులు

**ఉప్పల్, జనవరి 01 (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావును నూతన సంవత్సరం సందర్భంగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మా రెడ్డితో కలిసి ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, విటల్ యాదవ్, రామచందర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఈశ్వర్, సంతోష్, ఖాదర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.నూతన సంవత్సరంలో హరీష్ రావు మరింత ఆరోగ్యంతో ప్రజాసేవలో ముందుండాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన సేవలు మరింతగా అందాలని కోరారు.ఈ భేటీలో రాజకీయ పరిణామాలు, ప్రజాసమస్యల పై కూడా స్వల్పంగా చర్చ జరిగినట్లు సమాచారం.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు కేటీఆర్ ఎమ్మెల్యే కి తెలియజేసిన బన్నాల గీత




**చిల్కానగర్, జనవరి 01 (తెలంగాణ ముచ్చట్లు):** 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చిల్కానగర్ డివిజన్ నాయకులతో కలిసి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారికి శాలువాలతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు అమలు కావాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌తో పాటు సీనియర్ నాయకులు ఏదుల్లా కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ఫర్ఖ్యాక్, శ్యామ్, బాలు, ఓబేద్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.







# నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలి...

◆ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో ,జనవరి- 01(తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. రెవెన్యూ సంఘం, ఇతర అధికారుల ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి టి.ఎన్.జి.ఓ., టి.జి.ఓ., తహసిల్దార్ సంఘం, పంచాయతీ కార్యదర్శుల సంఘాలకు చెందిన సంఘాల క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపడానికి వచ్చిన వివిధ వర్గాలకు చెందిన అధికారులు, సిబ్బంది నుంచి కలెక్టర్ కేవలం నోట్ బుక్స్, పెన్స్, చదువుకునే పిల్లలకు అవసరమయ్యే స్టేషనరీ వస్తువులు మాత్రమే తీసుకున్నారు. ఖమ్మం బాల సదనంకు చెందిన పిల్లలు, ఎస్సి, బీసీ, మైనారిటీ గురుకులాల పిల్లలు జిల్లా కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలు సొంతంగా తయారు చేసిన గ్రీటింగ్ కార్డులను కలెక్టర్ పరిశీలించి వారిని అభినందించారు. అదనపు కలెక్టర్లు, డిఆర్ఓ, చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ, బ్రహ్మకుమారీలు, జూబ్లీ క్లబ్ కమిటీ, రైస్ మిల్స్ అసోసియేషన్, పోలీస్ శాఖ, ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్చంద సంస్థల ప్రతినిధులు కలెక్టర్ ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని, నూతనంగా ఎంపికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఆధ్వర్యంలో గ్రామ పాలన బాగుండాలని, నూతన సంవత్సరంలో ఖమ్మం నగర వ్యాప్తంగా రోడ్డు పనులు, వివిధ అభివృద్ధి పనులు పూర్తి కావాలని, అభివృద్ధిలో దూసుకు పోవాలని అన్నారు. నూతన సంవత్సరంలో జిల్లా సర్వతోముఖాభివృద్ధితో ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ ఆకాంక్షించారు.







# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**ఖమ్మం బ్యూరో, జనవరి 1 (తెలంగాణ ముచ్చట్లు):** భవిష్యత్తులో ఎదురైయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ కొత్త ఉత్సాహంతో ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకలను సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరపున పోలీస్ సిబ్బందికి, హోంగార్డ్, ప్రజలందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్ యంత్రాంగం చేసిన సమిష్టి కృషి ఫలితమే నేడు సంతోషకరమైన వాతావరణంలో వేడుకలు జరుపుకుంటానమని అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం జిల్లా పోలీసు యంత్రాంగం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా & ఆర్డర్ ప్రసాద్ రావు అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం, ఏసీపీలు, అర్ఐలు, సిఐలు, ఎస్సైలు, పోలీస్ కమిషనర్ కార్యాలయ మినిస్ట్రీయల్ స్టాఫ్, పాల్గొన్నారు.

# టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్–2843) మీడియా డైరీని ఆవిష్కరించిన గవర్నర్





**ఖమ్మం బ్యూరో,జనవరి 01(తెలంగాణ ముచ్చట్లు) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ - హెచ్-2843) రూపొందించిన 2026 మీడియా డైరీని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గురువారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య గవర్నర్‌కు ఫెడరేషన్ ఆవిర్భావం, జర్నలిస్టుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలు, అలాగే 2026 మీడియా డైరీ ప్రాముఖ్యతపై సవివరంగా వివరించారు. మీడియా డైరీని పరిశీలించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సమగ్ర సమాచారం, ఉపయోగకరమైన అంశాలతో రూపొందిన ఈ డైరీ జర్నలిస్టులతో పాటు సామాన్య ప్రజలకు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ప్రశంసించారు. ఇలాంటి విలువైన ప్రచురణను తీసుకువచ్చిన టిడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులను ఆయన అభినందించారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సహ-కన్వీనర్లు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపు రావుతో పాటు పద్మనాభ రావు, జె. ఉదయ్ భాస్కర్ రెడ్డి, గోపాల్ తదితరులు గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి సచివాలయంలో నిర్వహించిన మరో కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ 2026 మీడియా డైరీని సమాచార & ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరియు ప్రత్యేక కమిషనర్ చి. ప్రియాంక చేతుల మీదుగా ప్రత్యేకంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు మంత్రికి, ప్రత్యేక కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ద్వేష రాజకీయాలకు చెక్







- రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఖమ్మంలో ప్రజా ర్యాలీ
- ప్రజాస్వామ్యానికి ప్రజల స్వరం: "షుక్రియా... షుక్రియా" నినాదాలతో ఉవ్వెత్తున స్పందన

**ఖమ్మం బ్యూరో ,జనవరి 01(తెలంగాణ ముచ్చట్లు):** భాష, మతం, కులం, ప్రాంతం, లింగం పేరుతో సమాజంలో పెరుగుతున్న ద్వేష ప్రసంగాలు, ద్వేష నేరాలు దేశ ఐక్యతకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ముప్పుగా మారుతున్నాయని రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ పేర్కొన్నారు. ద్వేషానికి అడ్డుకట్ట వేయడం దేశ హితం కోసమేనని, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

హేట్ స్పీచ్ & హేట్ క్రైమ్స్ నివారణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) తీసుకురావాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో శాంతియుత ప్రజా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, యువత, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న అసత్య ప్రచారం, విద్వేష వ్యాఖ్యలు సమాజంలో విభజనను పెంచుతున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. భావప్రకటన స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. ర్యాలీని ఉద్దేశించి సయ్యద్ సాదిక్ అలీ మాట్లాడుతూ,

"రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించింది. ద్వేష ప్రసంగాలు ఆ రాజ్యాంగ ఆత్మను దెబ్బతీస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ అంశంపై తీసుకుంటున్న ముందడుగు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. దేశం బాగు కోసం మీరు ఆలోచిస్తే, దేశ ప్రజలు మీకోసం ఆలోచిస్తారు" అని అన్నారు.

ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగిన ఈ ర్యాలీ పోలీసు శాఖ సమన్వయంతో ఎక్కడా ఉద్రిక్తతలకు తావు లేకుండా శాంతియుతంగా కొనసాగింది. "వి ద్వేషానికి చోటు లేదు, రాజ్యాంగమే మా దారి", "విభజన కాదు, సమైక్యత కావాలి" వంటి నినాదాలు ప్రజల్లో చైతన్యం నింపాయి. ఈ ర్యాలీకి జర్నలిస్టులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, పౌరహక్కుల కార్యకర్తలు మద్దతు తెలిపారు. హేట్ స్పీచ్‌పై చట్టం అవసరమే అయినప్పటికీ, మీడియా స్వేచ్ఛకు భంగం కలగకుండా, నిజమైన ప్రజాహిత విమర్శలను కట్టడి చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలతో చట్టం అమలవ్వాలని వారు సూచించారు. అలాగే, హేట్ స్పీచ్ & హేట్ క్రైమ్స్ నివారణ దిశగా ముందడుగు వేసిన సిద్ధరామయ్య నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వ చర్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయని వక్తలు పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని గంభీరంగా పరిగణించి ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) తీసుకురావడం అభినందనీయమన్నారు.

ర్యాలీ మొత్తం "షుక్రియా... షుక్రియా" నినాదాలతో మార్మోగింది. రాజ్యాంగ పరిరక్షణకు, దేశ హితం కోసం తీసుకునే బాధ్యతాయుత నిర్ణయాల పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ఈ నినాదాలు ప్రతిబింబించాయని నిర్వాహకులు పేర్కొన్నారు. సమైక్యతే లక్ష్యంగా, రాజ్యాంగమే దారిగా సాగిన ఈ శాంతియుత ప్రజా ర్యాలీ ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక పాలేరు నియోజకవర్గం బాధ్యులు నజీరుద్దీన్ ,తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు సైదా కూసుమంచి మండల అధ్యక్షులు ఖలీమ్ కొండపల్లి అధ్యక్షులు సుభాని ఖమ్మం రూరల్ అధ్యక్షులు గౌస్ పాషా.. మత పెద్ద ఇమామ్ .అబ్దుల్ ఘని రాజ్యాంగ పరిరక్షణ వేదిక గౌరవ సలహాదారులు సయ్యద్ ఇస్మాయిల్ పెంటూ సాహెబ్. ఇబ్రహీం. అబ్దుల్ ఘని. హుస్సేన్. తదితరులు పాల్గొన్నారు

# సీఎం రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు.!



- మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపిన డాక్టర్ తుమ్మల యుగంధర్.

**సత్తుపల్లి, జనవరి 1 (తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సరం శుభఫలితాలు తీసుకురావాలని, తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలవ్వాలని కోరారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై స్వల్పంగా చర్చించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డాక్టర్ తుమ్మల యుగంధర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. నూతన సంవత్సరం రాష్ట్ర ప్రజలకు శాంతి, సౌభాగ్యం, సమృద్ధి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించినట్లు తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంత్రి పొంగులేటి ప్రజా పాలన : తుంబూరు దయాకర్ రెడ్డి





- క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

**ఖమ్మం బ్యూరో, జనవరి 1 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అందుతున్న సంక్షేమ పథకాల ఫలాలు నూతన సంవత్సరంలో కూడా ప్రతి అర్హుడికి చేరాలని దయాకర్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా పాలనలో రెండేళ్ల కాలంలోనే "మంత్రి పొంగులేటి మార్క్" స్పష్టంగా కనిపిస్తోందని, సొంత నియోజకవర్గం పాలేరుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోనూ సంక్షేమ పథకాల అమలులో ఆయన ప్రత్యేక ముద్ర వేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిగరెట్, పాన్ మసాలాపై 40% జీఎస్టీ..

## ఫిబ్రవరి 1 నుంచి వర్తింపు



పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై సెస్సు విధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అది ఫిబ్రవరి 1 నుంచి వర్తించనుందని తాజాగా నోటిఫికేషన్ ఇచ్చింది. పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై 40 శాతం.. బీడీలపై 18 శాతం కేంద్రం జీఎస్టీ విధించింది. ఈ పన్నుతో పాటు పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రత సెస్ పెంపు, పొగాకుతో పాటు సంబంధిత ఉత్పత్తులకు ఎక్సైజ్ సుంకం వేసింది. ఇవన్నీ ఫిబ్రవరి ఒకటో తారీఖు నుంచి అమలవుతాయి.

పాన్ మసాలా తయారీపై ఆరోగ్య, జాతీయ భద్రత సెస్, పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ విధించేలా రెండు బిల్లులను పార్లమెంట్ డిసెంబర్‌లో ఆమోదించింది. 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025' బిల్లును ఆమోదించిన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ.. 'పాన్‌మసాలపై ఇప్పటికే 40శాతం జీఎస్టీ విధిస్తున్నారు. దీనికి సెస్ అదనం. తయారీ కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా సమకూరే నిధులను జాతీయ భద్రత బలోపేతానికి, ప్రజారోగ్యం కోసం ఖర్చు చేయనున్నాం'' అని వెల్లడించారు.

కేంద్రం నోటిఫికేషన్‌తో సిగరెట్ కంపెనీలైన ఐటీసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి ఆ ఉత్పత్తుల ధరలు పెరగనుండటంతో అమ్మకాలు తగ్గనున్నాయనే అంచనాల నేపథ్యంలో ఈ స్టాక్స్ నష్టపోయాయి. బీఎస్ఈలో ఐటీసీ షేరు ధర 52 వారాల కనిష్ఠానికి పడిపోయింది. ఫిలిప్స్ షేరు 10 శాతం కుంగింది.

# హెచ్-1బీ వీసాల ఆలస్యం.. భారత ఉద్యోగులకు అమెజాన్ ఊరట




హెచ్ 1బీ వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచి చూస్తూ భారత్‌లో ఉండిపోయిన తమ ఉద్యోగులకు అమెజాన్ ఊరట కలిగించే విషయం చెప్పింది. ఐదు రోజులు ఆఫీస్‌కు రావాలనే నిబంధనను సడలించి, మార్చి వరకు రిమోట్‌గా పనిచేసేందుకు వెసులుబాటు కల్పించింది. ఇందుకు కొన్ని షరతులు విధించినట్లు సమాచారం. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులకు అడ్వైజరీ పంపినట్టు తెలిసింది.

హెచ్ 1బీపై అమెరికాలో పనిచేస్తూ వివిధ కారణాలతో భారత్ వచ్చిన అమెజాన్ ఉద్యోగులు.. వీసా అపాయింట్‌మెంట్‌లో జాప్యం కారణంగా ఇక్కడే ఉండిపోయారు. ఇలా డిసెంబర్ 13 నాటికి భారత్‌కు వచ్చి, రీషెడ్యూల్ వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులకు ఈ ఏడాది మార్చి 2 వరకు ఇంటి నుంచే పని చేసుకునేందుకు అమెజాన్ అనుమతి ఇచ్చింది.

ఈ సమయంలో కోడింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, సంబంధిత వ్యవహారాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం లేదా కస్టమర్లతో మాట్లాడటం వంటివి చేయకూడదని స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. వీటితోపాటు భారత్‌లో ఉన్న అమెజాన్ కార్యాలయాలకు వెళ్లకూడదని ఆదేశించింది.

హెచ్ 1బీ వీసా అపాయింట్‌మెంట్‌లో జాప్యం కారణంగా అమెజాన్‌తో పాటు గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వీసా రీఎంట్రీ ప్రక్రియకు నెలల సమయం పట్టే అవకాశం ఉందని, అందుకే అమెరికాను వీడి బయటకు వెళ్లొద్దని గూగుల్ ఇటీవల తన ఉద్యోగులకు సూచించిన విషయం తెలిసిందే.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# ముంబైలో భారీగా బంగారం స్వాధీనం

- ఇద్దరు విదేశీ మహిళల వద్ద 32.79 కేజీల బంగారం పట్టివేత




**ముంబై,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** నగరంలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి దాదాపు 32.79 కేజీల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ బంగారం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.19.15 కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు వివరించారు. ఆఫ్రికన్ దేశాల నుంచి ఈ ఇద్దరు మహిళలు వచ్చారని చెప్పారు. వీరిద్దరు వేర్వేరుగా విదేశాల నుంచి వచ్చారన్నారు. ఛత్రపతి శివాజీ విమానాశ్రయంలో దిగిన వీరు..
తీరు అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రయాణికులను అదుపులోకి తీసుకుని.. తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. సదరు మహిళల లోదుస్తులతోపాటు లగేజీలో భారీగా బంగారం దాచినట్లు గుర్తించామని కస్టమ్స్ అధికారులు వివరించారు. వీరిద్దరిని అరెస్ట్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి.. విచారిస్తున్నామని కస్టమ్స్ అధికారులు చెప్పారు.



# న్యూ ఇయర్ వేడుకల్లో అపశృతి

- స్విస్ హోటల్‌లో పేలుడుకు 40మంది మృతి

**న్యూఢిల్లీ,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సరం వేళ స్విట్జర్లాండ్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ స్కీ రిసార్ట్ నగరం క్రాన్స్ మోంటానాలో ఓ బార్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 40 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు స్థానిక అధికారిక వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిరచాయి. మరో 100 మందికి గాయపడినట్లు తెలిపాయి. మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. బార్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుగుతుండగా అర్ధరాత్రి 1.30 గంటలకు ఈ పేలుడు చోటుచేసుకుంది. పేలుడు ధాటికి భారీగా మంటలు చెలరేగాయి. సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఈ ఘటనలో ఉగ్ర కుట్ర లేదని అధికారిక వర్గాలు వెల్లడిరచాయి. బాణసంచా కారణంగా ఈ పేలుడు సంభవించి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.
స్విస్ ఆల్ప్స్ పర్వతశ్రేణుల నడుమ ఉన్న ఈ క్రాన్స్ మోంటానా నగరం ప్రముఖ పర్యాటక స్థలం. ఏటా డిసెంబరు`జనవరి సమయంలో ఇక్కడ పర్యాటకుల తాకిడి విపరీతంగా ఉంటుంది. గత కొంతకాలంగా ఇక్కడ కార్చిచ్చులు చోటుచేసుకుంటున్నట్లు సమాచారం.

# ఎక్సైజ్ శాఖకు న్యూ ఇయర్ కిక్కు



- భారీగా సాగిన మద్యం అమ్మకాలు
- డిసెంబరులో రూ.5,102 కోట్ల మద్యం విక్రయం

**హైదరాబాద్,జనవరి1(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో మద్యం అమ్మకాలకు నూతన సంవత్సర జోష్ మరింత కిక్కిచ్చింది. మంగళ, బుధవారాలు రెండు రోజుల్లో ఏకంగా రూ.750 కోట్లకుపైగా మద్యం విక్రయాలు జరిగాయి. డిసెంబరు నెలలో మొత్తమ్మీద రూ.5,102 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబరు నెలకు సంబంధించి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ చరిత్రలో అమ్మకాలు,

ఆదాయం ఇదే అత్యధికం కావడం గమనార్హం. అటు.. కొత్త మద్యం వ్యాపారులకు కూడా తొలినెలలోనే కాసుల వర్షం కురిసింది. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు 2024 డిసెంబరులో రూ.3,800 కోట్లు, 2023 డిసెంబరులో రూ.4,297 కోట్లు మాత్రమే. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి రూ.1,300 కోట్లకుపైగా అధికంగా మద్యం విక్రయాలు జరిగాయి. భారీగా మద్యం విక్రయాలు ఉండవచ్చని అంచనా వేసిన ఎక్సైజ్‌శాఖ స్టాక్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. కాగా, రాష్ట్రంలో 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. కొత్త మద్యం పాలసీ ద్వారా నవంబర్‌లో దుకాణాలను కేటాయించగా.. డిసెంబరు ఒకటో తేదీ నుంచి కొత్త వ్యాపారులు విక్రయాలు ప్రారంభించారు. వారికి డిసెంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు రావడం, తర్వాత క్రిస్మస్, ఇప్పుడు నూతన సంవత్సర వేడుకలు కలిసి వచ్చాయి. డిసెంబరు తొలి రెండు వారాల్లో పెళ్లిళ్లు, పర్యాటక ప్రాంతాల్లో ఈవెంట్లతోనూ మద్యం అమ్మకాలు పెరిగాయి. డిసెంబరు 30న ఒక్క రోజే రూ.375 కోట్ల విక్రయాలు నమోదవగా.. 31న సాయంత్రానికే అమ్మకాలు రూ.350 కోట్లు దాటేశాయి. అర్ధరాత్రి 12గంటల వరకు మద్యం దుకాణాలు, ఒంటి గంట వరకు బార్లు తెరిచి ఉంచేందుకు ఎక్సైజ్‌శాఖ అనుమతి ఇవ్వడంతో అమ్మకాలు మరింత భారీగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్త వ్యాపారులకు తొలినెలలోనే మంచి ఆదాయం రావడంతో ఆనందం వ్యక్తమవుతోంది.

# సందడిగా మారిన లోక్‌భవన్










# ఔచిత్యం కోసం పోరాడాల్సి వస్తుందో..!?

- 2027 వరల్డ్?కప్ తర్వాత వన్డే ఫార్మాట్ మనుగడ కష్టమే
- టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్



ప్రపంచకప్ తర్వాత వన్డే ఫార్మాట్ మనుగడ, ఔచిత్యం కోసం పోరాడాల్సి వస్తుందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టీమ్‌ఇండియా స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలు వన్డే ఫార్మాట్?కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఈ పరిస్థితి తలెత్తుతుందని అన్నాడు. ఓ హిందీ యూట్యూబ్ ఛానెల్?కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేశాడు.''విరాట్, రోహిత్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడడం చాలా చర్చకు దారితీసింది. అయితే టీ20 లీగ్‌ల విస్తరణ, టెస్ట్ క్రికెట్‌కు ఇప్పటికే వాటికంటూ ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఓవర్ల ఫార్మాట్‌కు ఉన్న విలువ క్రమంగా తగ్గిపోతోంది. 2027 ప్రపంచకప్ తర్వాత వన్డేల భవిష్యత్తుపై నాకు నమ్మకం లేదు. వన్డే ఫార్మాట్ గురించి నేను కాస్త ఆందోళన చెందుతున్నాను. వాస్తవానికి నేను విజయ్ హజారే ట్రోఫీని ఫాలో అవుతున్నాను. కానీ నేను సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని ఫాలో అయినంతగా విజయ్ హజారే ట్రోఫీని అనుసరించడం కాస్త కష్టంగా ఉంది. అలాగే ప్రేక్షకులు ఏ ఫార్మాట్?లో క్రికెట్ ను చూడాలనుకుంటున్నారో మనం తెలుసుకోవాలి. టెస్ట్ క్రికెట్?కు ఇంకా స్పేస్ ఉందని నేను భావిస్తున్నాను. కానీ వన్డే క్రికెట్?కు మాత్రం స్థానం లేదని నేను గట్టిగా నమ్ముతున్నాను.'' అని అశ్విన్ తెలిపాడు.కోహ్లీ, రోహిత్ (ఇద్దరూ కలిపి 86 వన్డే సెంచరీలు) రిటైర్ అయిన తర్వాత వన్డే ఫార్మాట్ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశాడు అశ్విన్. కోహ్లీ, రోహిత్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నారని, దాంతో క్రీడాభిమానులు విజయ్ హజారే ట్రోఫీని చూడటం ప్రారంభించారని అన్నాడు. ఏదైనా క్రీడ ఎల్లప్పుడూ వ్యక్తుల కంటే గొప్పదని మనకు తెలుసని, కానీ కొన్నిసార్లు ఈ ఆటగాళ్లు (రోహిత్‌కోహ్లీ) ఆటను ఆసక్తిగా మార్చడానికి తిరిగి రావాల్సి ఉంటుందని వ్యాఖ్యానించాడు. ''విజయ్ హజారే ట్రోఫీ వాస్తవానికి ఒక దేశీయ పోటీ. దీనిని ఎక్కువ మంది ఫాలో అవ్వరు (చూడరు). కానీ విరాట్, రోహిత్ ఆడుతున్నందున ఈ ట్రోఫీని చూస్తున్నారు. వారు వన్డే ఫార్మాట్?కు గుడ్ బై చెప్పేస్తే పరిస్థితి ఏంటి?. 50 ఓవర్ల క్రికెట్ ఒక అద్భుతమైన ఫార్మాట్. ఇన్నింగ్స్‌ను ఎలా చక్కదిద్దాలో తెలిసిన మహేంద్ర సింగ్ ధోనీ వంటి ఆటగాడిని ఈ ఫార్మాట్ సృష్టించింది. వన్డే ఫార్మాటే ఎంఎస్ ధోని లాంటి ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. ధోనీ చివరిలో చెలరేగిపోవడానికి ముందు 1015 ఓవర్ల పాటు సింగిల్స్ తీసేవాడు. ఇప్పుడు ధోని లాంటి ఆటగాళ్లు లేరు. అలా ఆడాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే మీరు రెండు కొత్త బంతులతో ఆడుతున్నారు. సర్కిల్ లోపల ఐదుగురు ఫీల్డర్లతో ఆడుతున్నారు.'' అని అశ్విన్ గుర్తు చేసుకున్నాడు. అలాగే ఐసీసీ తన క్యాలెండర్?ను పునర్ పరిశీలించాలని అశ్విన్ కోరాడు. వన్డే ఫార్మాట్ నిరుపయోగంగా మారిందన్నాడు. ప్రతి ఏటా ఆదాయం కోసం ఒక ఐసీసీ టోర్నమెంట్ జరుగుతోందని అన్నాడు. కానీ ఫిఫా ఎలా చేస్తుందో చూడండని పేర్కొన్నాడు. ''పుట్?బాల్ లీగ్‌లు (ఈపీఎల్, లా లిగా, సీరీ ఏ, బుండెస్లిగా) జరుగుతున్నాయి. వారు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి ప్రపంచకప్‌ను నిర్వహిస్తారు. ప్రపంచకప్ ఒక ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ కాబట్టి దానికి విలువ ఉంది. అయితే క్రికెట్?లో మరీ ఎక్కువ ద్వైపాక్షిక సిరీస్‌లు, ఎక్కువ ప్రపంచ కప్‌లు నిర్వహించడం కొంచెం అతిగా అనిపిస్తుంది. రాబోయే టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా వర్సెస్ యూఎస్ఏ, టీమ్ ఇండియా వర్సెస్ నమీబియా వంటి మ్యాచ్‌లు ఒక రకంగా క్రికెట్?కు ప్రేక్షకులను దూరం చేస్తాయి. నిజంగా వన్డే క్రికెట్‌కు ప్రాముఖ్యం తీసుకురావాలనుకుంటే టీ20 ఎక్కువగా ఆడి ప్రతి నాలుగేళ్లకు ఒకసారి వన్డే ప్రపంచకప్ పెట్టండి.'' అని అశ్విన్ తన అభిప్రాయాన్ని తెలిపాడు.

# సిడ్నీ టెస్టులో గెలిస్తేనే స్టోక్స్-మెక్‌కల్లమ్‌పై నమ్మకం వచ్చేది

**యాషెస్ సిరీస్ ఆఖరి టెస్టు ముందు మైకెల్ వాన్ వ్యాఖ్యలు**



ఇంగ్లండ్ క్రికెట్ భవిష్యత్తును నిర?యించే మ్యాచ్‌గా సిడ్నీ టెస్టు మారవచ్చని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ హెచ్చరించాడు. బాక్సింగ్ డే టెస్టులో వచ్చిన విజయంతో ఇంగ్లండ్ జట్టుకు ఆత్మవిశ్వాసం పెరిగినా, అది పూర్తిస్థాయి టెస్ట్ విజయం కాదని, సిడ్నీలో జరిగే ఆఖరి యాషెస్ టెస్ట్ అసలు పరీక్షగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డాడు.సిరీస్ ఆరంభంలోని తొలి మూడు టెస్టుల్లో ఇంగ్లండ్ దారుణంగా విఫలమై యాషెస్ కోల్పోయింది. అయితే ఎంసీజీలో బౌలర్లకు అనుకూలంగా మారిన పిచ్‌పై ఇంగ్లండ్ రాణించింది. ఆ మ్యాచ్‌లో మొత్తం 36 వికెట్లు పడగా, అన్నీ ఫాస్ట్ బౌలర్లకే దక్కాయి. రెండు రోజుల్లోనే మ్యాచ్ ముగియడంతో అది నిజమైన టెస్ట్ క్రికెట్ కంటే లాటరీలా అనిపించిందని వాన్ వ్యాఖ్యానించాడు.సిడ్నీ టెస్టు ప్రాముఖ్యతను ప్రత్యేకంగా ప్రస్తావించిన వాన్, మెల్‌బోర్న్ విజయం మంచి మోరల్ బూస్ట్ ఇచ్చినా, అది ఇంగ్లండ్ జట్టు నిజమైన పురోగతిని చూపించలేదన్నారు. ''ఇది రెండు రోజుల మ్యాచ్ కాకూడదు. ఇక్కడ గట్టి పోరాటం చేసి గెలిస్తేనే స్టోక్స్%%మెక్కల్లమ్ కాంబినేషన్ నిజంగా ముందుకు వెళ్తుందనడానికి ఆధారంగా ఉంటుంది'' అని ఆయన స్పష్టం చేశాడు.ఎంసీజీలో వచ్చిన విజయం 2011 తర్వాత ఆస్ట్రేలియాలో ఇంగ్లండ్ సాధించిన తొలి టెస్ట్ విజయం కావడం గమనార్హం. ఈ గెలుపుతో 5,000 రోజులకు పైగా సాగిన నిరీక్షణకు ఇంగ్లండ్ ముగింపు పలికింది. బ్రెండన్ మెక్కల్లమ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంగ్లండ్ 45 టెస్టులు ఆడి, 25 గెలిచి 17 ఓడిరది.
అయితే సిడ్నీలో భారీ ఓటమి ఎదురైతే జట్టు నాయకత్వంపై నిజాయితీగల చర్చలు తప్పవని వాన్ హెచ్చరించాడు. ''స్టోక్స్, బాజ్ (మెక్కల్లమ్) కొనసాగుతారని నాకు అనుమానం లేదు. కానీ సిడ్నీలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోతే, లోతైన ఆత్మపరిశీలన అవసరం. కొన్ని తప్పులు జరిగాయని అంగీకరించకపోతే ముందుకు వెళ్లడం కష్టం'' అని అన్నాడు. అతి వేగంగా మార్పులు చేయడం సరైన మార్గం కాదని, కానీ తప్పులను ఒప్పుకుని పరిపక్వతతో ముందుకు సాగాలని వాన్ సూచించాడు. జట్టు మాటల్లో, ఆటలో మరింత మెచ్యూరిటీ అవసరమని, అలా చేస్తేనే స్టోక్స్%%మెక్కల్లమ్ కాంబినేషన్ బలంగా కొనసాగుతుందని అభిప్రాయపడ్డాడు.



# శ్రీశైలంలో న్యూ ఇయర్ రద్దీ

**శ్రీశైలం,జనవరి 1 (ఆర్ఎన్ఎ):** శ్రీశైలంమల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్యూ లైన్లు కిక్కిరిసి పోయాయి. గురువారం వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆర్జిత సేవలు, అభిషేకాలు నిలిపివేశారు. భక్తులకు అలంకార దర్శనానికి మాత్రమే అనుమతిస్తున్నారు. స్వామివారి దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సైకలాజికల్ హారర్ మూవీ హనీ




నవీన్ చంద్ర, దివ్య పిళ్లై కీలక పాత్రల్లో నటిస్తున్న లేటెస్ట్ సైకలాజికల్ హారర్ మూవీ 'హనీ'. శేఖర్ స్టూడియోస్ సమర్పణలో క్షుం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మాణంలో దర్శకుడు కరుణ కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రియల్ లైఫ్‌లో జరిగిన పలు సంఘటనలను ఆధారంగా చేసుకుని రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే ఆసక్తికరమైన బజ్‌ను క్రియేట్ చేస్తోంది. న్యూ ఇయర్ కానుకగా మేకర్స్ నేడు 'హనీ' మూవీ ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ విడుదలైనప్పటి నుంచే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజికల్ ఎలిమెంట్స్‌ను కలగలిపి, ప్రేక్షకులను భయపెట్టే విధంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లు గ్లింప్స్ ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా కథను రూపొందించడం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. గ్లింప్స్‌లో కనిపించే విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాత్రల ప్రవర్తన అన్ని కలిసి ఓ డిస్టర్బింగ్, మిస్టీరియస్ వాతావరణాన్ని క్రియేట్ చేస్తున్నాయి. నవీన్ చంద్ర పాత్ర చాలా డిఫరెంట్ షేడ్స్‌తో ఉండబోతుందని, దివ్యా పిళ్లై క్యారెక్టర్ కథలో కీలక మలుపులు తిప్పబోతుందనే సంకేతాలు గ్లింప్స్‌లో కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో దివి, రాజా రవీంద్ర, బేబీ జయన్ని, బేబీ జయత్రి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు కరుణ కుమార్ గతంలో రియలిస్టిక్ టచ్‌తో కథలను చెప్పిన అనుభవాన్ని ఈసారి హారర్ జానర్‌లో ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. 'హనీ' సినిమా ఫిబ్రవరి 6న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. హారర్ సినిమాలకి కరెక్ట్ సీజన్‌లో ఈ సినిమా రావడంతో మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.



## స్పిరిట్ నుంచి ప్రభాస్ లుక్ విడుదల


ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' నూతన సంవత్సరం సందర్భంగా డార్లింగ్ అభిమానులకు దర్శకుడు సందీప్ అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. మూవీలోని ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు. ఇప్పటివరకూ తెరపై చూడని సరికొత్త అవతారంలో ప్రభాస్ కనిపించారు. ఒళ్లంతా గాయాలతో కమిలిపోయి ఉండగా, బ్యాండ్`ఎయిడ్‌లు కట్టుకుని ప్రభాస్ వెనక్కి తిరిగి నిలబడ్డారు. ఆయన ముందు త్రిప్తి దిమ్రి నిలబడి ఉంది. రా అండ్ రస్టిక్‌గా ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. చూడడానికి 'యానిమల్'లో రణబీర్ పాత్ర ఛాయలు కనిపిస్తున్నా, ప్రభాస్ కటౌట్ కావడంతో అంతకు మించిన హైఓల్టేజ్ యాక్షన్ చూపించబోతున్నట్లు అర్థమవుతోంది. 'ఇండియన్ సినిమా.. మీ ఆజానుబాహుడు/ఆజానుబాహు'ను చూడండి. హ్యాపీ న్యూఇయర్ 2026' అని సందీప్ వంగా పేర్కొన్నారు. 'మీరు ఇప్పటివరకూ ఉన్న దానిని ప్రేమించారు. ఇక నుంచి మీకు తెలియనిదానితో ప్రేమలో పడండి' అని టీమ్ పేర్కొంది. ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. సినిమా ప్రారంభం సందర్భంగా 'సౌండ్ స్టోరీ' పేరుతో ఓ ఆడియో టీజర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. ప్రభాస్ అకాడమీ టాపర్ అయిన ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్టు తెలుస్తోంది.




## సంక్రాంతి బరిలో అనగనగా ఒక రాజు

### అందరూ ఆదరించాలన్న నవీన్ పోలిశెట్టి

'సంక్రాంతి సినిమా అంటేనే వినోదం. అందుకే కడుపుబ్బా నవ్వించే మా 'అనగనగా ఒక రాజు' చిత్రాన్ని పండక్కి విడుదల చేస్తున్నాం. దీన్ని కుటుంబ సమేతంగా చూసి ఆనందించాలని కోరుతున్నాం' అని కథానాయకుడు నవీన్ పొలిశెట్టి అన్నారు. మీనాక్షి చౌదరి జంటగా నటించిన ఈ చిత్రాన్ని మారి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. 'వరుసగా మూడు విజయాల తర్వాత అదే ఉత్సాహంలో అందరి ముందుకు మరో అదిరిపోయే చిత్రం తీసుకొద్దామనుకున్నా. కానీ, ఓ యాక్సిడెంట్ వల్ల కొన్ని నెలలు చిత్రీకరణకు దూరమయ్యా. మానసికంగా, శారీరకంగా కోలుకోవడానికి చాలా టైమ్ పట్టింది. ఆ సమయంలోనే మా బృందంతో కలిసి 'అనగనగా ఒక రాజు' కథ రాసుకున్నా. గత ఫిబ్రవరిలో చిత్రీకరణ ప్రారంభించా. అందరి ప్రేమతో ఆరు నెలల్లోనే సరదాగా షూట్ పూర్తి చేసేశాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఇంతటి వినోదాత్మక చిత్రాన్ని పండక్కి విడుదల చేయడమే కరెక్ట్ అనుకున్నాం. ఒకప్పుడు నేను ఏ హీరోల సినిమాలకైతే థియేటర్లకు వెళ్లి సినిమా చూసేవాడినో.. ఇప్పుడు ఆ అభిమాన హీరోల సినిమాలతో పాటు నా చిత్రం విడుదల కానుండటం సంతోషంగా ఉంది. ఈ పండక్కి విడుదలవుతున్న అన్ని చిత్రాలు విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఇన్ని మంచి సినిమాలతో ఈసారి సంక్రాంతి నిజంగానే తెలుగు ప్రేక్షకులకు సినిమా పండగను తీసుకొచ్చింది' అన్నారు. 'ఇదొక మంచి కుటుంబ కథా చిత్రం. దీన్ని అందరూ ఆదరించాలని కోరుతున్నా' అంది నటి మీనాక్షి చౌదరి.



# ఓ చిన్న పిప్పలి ముక్క చాలు కడుపంతా క్లియర్


శీతాకాలం పీక్ స్టేజీకి చేరుకుంది. రోజు రోజుకి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలికాలంలో ఎన్నో వ్యాధులు చుట్టుముడతాయి. ముఖ్యంగా జలుబు, దగ్గు, గొంతులో కఫం, ఛాతీలో కఫం, మలబద్ధకం సమస్యలు తీవ్రంగా ఉంటాయి. వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. వీటిని తగ్గించడానికి చాలా మంది అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు మెడిసిన్ వాడితే.. మరికొందరు నాటు వైద్యాన్ని నమ్ముకుంటారు. అయితే, వీటికి చక్కటి పరిష్కారం ఒకటి ఉంది. అదే పిప్పలి. ఒకప్పుడు పిప్పలికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. పిప్పలికి ఆయుర్వేదంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీనిని పొడుగ్గా ఉన్న నల్ల మిరియాలతో పోలుస్తారు. ఆయుర్వేదంలో పిప్పలిని ఔషధ గుణాల నిధిగా పరిగణిస్తారు. ఇది రుచి, ప్రభావంలో చాలా శక్తివంతమైన మసాలాగా పరిగణిస్తారు. పురాతన వైద్య గ్రంథాలు పిప్పలిని జీర్ణక్రియ, శ్వాసక్రియ, రోగ నిరోధక వ్యవస్థ బలపేతం చేసే శక్తిగా అభివర్ణిస్తారు. శీతాకాలంలో పిప్పలిని తీసుకోవడం ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. ఈ విషయాన్ని ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ మనీషా మిశ్రా ఎమ్‌డి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. డాక్టర్ మనీషా పిప్పలి ఆయుర్వేద ప్రయోజనాలు, ఎలా తీసుకోవాలో చెప్పారు. ఆ పూర్తి వివరాలపై ఓ లుక్కేద్దాం. ఈ రోజుల్లో చాలా మంది మలబద్ధకంతో బాధపడుతున్నారు. ఇక చలికాలంలో మలబద్ధక సమస్య తీవ్రంగా ఉంటుంది. మలవిసర్జన సాఫీగా జరగదు. కడుపులో గందరగోళంగా ఉంటుంది. అయితే పిప్పలిలో ఉండే లక్షణాలు మలబద్ధకాన్ని తగ్గించడంలో సాయపడతాయని డాక్టర్ అంటున్నారు. వాస్తవానికి, ఈ మూలిక జీర్ణ కారకంగా పనిచేస్తుంది. ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేయడానికి సాయపడుతుంది. ఇది పేగు కదలికల్ని సులభతరం చేస్తుంది. దీంతో మలబ




ద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. మలవిసర్జన సాఫీగా జరిగేలా ప్రోత్సహిస్తుంది. పిప్పలి మలబద్ధకంతో పాటు గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపర్చడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌లను సక్రియం చేస్తుంది. మెరుగైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. పిప్పలి యొక్క అతిపెద్ద ప్రత్యేకత ఏంటంటే.. ఇది గ్యాస్ట్రిక్ అగ్నిని పెంచుతుంది. దీంతో జీర్ణక్రియ మెరుగుపడి.. ఆకలి పెరుగుతుంది. భోజనానికి ముందు నెయ్యితో చిటికెడు పిప్పలి పొడిని తీసుకోవడం వల్ల అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యల నుంచి రిలీఫ్ లభిస్తుంది. చలికాలంలో వచ్చిందంటే చాలు చాలా మంది జలుబు, దగ్గు, గొంతులో కఫం వంటి సమస్యలతో బాధపడతారు. ఈ సమస్యలకు పిప్పలి చక్కటి పరిష్కారం. పిప్పలికి వేడినిచ్చే ప్రభావం ఉంటుంది. దీంతో ఇది కఫాన్ని కరిగించడంలో సాయపడుతుంది. దీర్ఘకాలిక దగ్గు, శ్లేష్మం పేరుకుపోవడం. తరచుగా జలుబు వంటి సమస్యలకు చికిత్స అందించడంలో పిప్పలి ప్రభావవంతంగా ఉంటుంది. ఆయుర్వేదంలో ఇది శ్వాసకోశ వ్యవస్థను బలోపేతం చేసే మూలికగా పరిగణిస్తారు. మారుతున్న సీజన్లకు దగ్గుతో బాధపడేవారికి ఇది ప్రత్యేకంగా సాయపడతుందని డాక్టర్ అంటున్నారు. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: పిప్పలిలో యాంటీ బాక్టీరియల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. అంతేకాకుండా రోగనిరోధక శక్తిని బలపేతం చేస్తాయి. బరువు తగ్గడం: పిప్పలి శరీర జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది కేలరీల బర్నింగ్ పక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడంలో సాయపడుతుంది. కీళ్లు, కండరాల నొప్పి నుంచి రిలీఫ్: పిప్పలిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. దీని శోథ నిరోధక లక్షణాలు శరీరంలో మంటను తగ్గిస్తాయి. దీంతో, కీళ్ళ నొప్పి నుంచి రిలీఫ్ లభిస్తుంది. కాలేయ పనితీరును పెంచుతుంది: పిప్పలి కాలేయాన్ని నిర్విషీకరణ చేస్తుంది. టాక్సిన్లు తొలగించడంలో సాయపడుతుంది. కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. పిప్పలిని చూర్ణం చేసి తీసుకోవచ్చు. పిప్పలిని పొడి రూపంలో తీసుకోవచ్చు. పిప్పలి పొడి మార్కెట్లలో లభిస్తుంది. ఒక అర చెంచా పిప్పలి పొడిని పాలు లేదా గోరువెచ్చని నీటిలో తీసుకోవచ్చు. పిప్పలి పొడిని లేదా పిప్పలిని తేనెతో కలిపి తీసుకోవచ్చు. బెల్లంతో కూడా కలిపి తీసుకోవచ్చని డాక్టర్ అంటున్నారు. భోజనానికి ముందు నెయ్యితో చిటికెడు పిప్పలి పొడిని తీసుకోవడం వల్ల అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యల నుంచి రిలీఫ్ లభిస్తుంది. అయితే, ఒక విషయం గుర్తించుకోవాలి. అధికంగా తీసుకుంటే సైడ్ ఎఫెక్టస్ రావచ్చు. తక్కువ మోతాదులో తీసుకుంటే మంచిది. ఏదైనా దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడేవారు వైద్యుణ్ని సంప్రదించి తీసుకోవడం మేలు.

# మటన్ లివర్, చికెన్ లివర్ తింటున్నారా?

వారానికి ఒక రోజు మాంసం తినడం మాంసాహారులకు అలవాటుగా మారింది. ప్రస్తుత కాలంలో చికెన్ లివర్, మటన్ లివర్ తినే వారి సంఖ్య కూడా పెరిగింది.. ఎందుకంటే వీటిలో అనేక పోషకాలు దాగున్నాయి.. అందుకే.. నాన్ వెజ్ ఇష్టపడే చాలా మంది చికెన్ మటన్ లివర్ ఇష్టంగా తింటారు. మాంసాహారులు వారానికి కనీసం ఒకసారైనా చికెన్, మటన్, చేపలను తింటారు. అయితే.. ఇటీవల, పోషకాల ఎక్కువ ఉన్న చికెన్ లివర్, మటన్ లివర్ వినియోగం పెరిగింది. ఈ రెండూ అధిక పోషకాలు కలిగిన ఆహారాలు. కానీ ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి మంచిది.. ఏది తినడానికి ఉత్తమైనది.. అనే ప్రశ్నలు తలెత్తుతుంటాయి. చికెన్ లివర్ తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. చికెన్ లివర్‌లో ఐరన్, సెలీనియం, విటమిన్ ఎ, బి12, ఫోలేట్, ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇందులోని సెలీనియం కంటెంట్ క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అదనంగా,





విటమిన్ ఎ, బి12 కంటి, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మీరు డయాబెటిక్ అయితే, ఇది చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఉడికించిన కాలేయం తినడం వల్ల శరీర కొవ్వు తగ్గుతుంది. చికెన్ లివర్ కంటే మటన్ లివర్ ను ఎందుకు ఎక్కువగా తింటారు. చాలా మంది చికెన్ లివర్ కంటే మటన్ లివర్ తినడానికి ఇష్టపడతారు. మటన్‌లో కొవ్వు ఎక్కువగా ఉంటుంది కాబట్టి, చాలా మంది ముందుగా దానిని వండుకుని తింటారు. ఇందులో విటమిన్లు ఎ, డి, బి12, జింక్, పొటాషియం, కాపర్ వంటి పోషకాలు ఉంటాయి. అందువల్ల, దీనిని తినడం వల్ల శరీరంలో ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుంది. శరీరంలో రక్తం తక్కువగా ఉండటం వల్ల కొంతమందికి రక్తహీనత వస్తుంది. అలాంటి వారికి మటన్ లివర్ మంచి ఆహారం. విటమిన్ బి12 శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. ఇన్ఫెక్షన్ల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అయితే, కొంతమంది చికెన్, మటన్ లివర్ తినకూడదు.. కిడ్నీలో రాళ్ళు ఉన్నవారు, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు, గుండె జబ్బులు ఉన్నవారు, గర్భిణీ స్త్రీలు తినకూడదని నిపుణులు చెబుతున్నారు.

## థైరాయిడ్ రోగులు ఈ పదార్థాలను పక్కన పెట్టండి

ప్రస్తుత కాలంలో థైరాయిడ్ సమస్య అనేది చాలామందిని వేధిస్తున్న ప్రధాన ఆరోగ్య సమస్య. తప్పడు జీవనశైలి, విపరీతమైన ఒత్తిడి, పోషకాహార లోపం వల్ల ఈ గ్రంథి పనితీరు దెబ్బతింటోంది. థైరాయిడ్ హార్మోన్లు మన శరీర జీవక్రియలను నియంత్రిస్తాయి.. కాబట్టి మనం తినే ఆహారంలో చిన్న పొరపాటు జరిగినా అది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. థైరాయిడ్ సమస్య ఉన్నప్పుడు కేవలం మందులు వాడితే సరిపోదు.. ఆహార నియమాలు పాటించడం కూడా అంతే ముఖ్యం. కొందరు ఆరోగ్యకరమని భావించి తినే కూరగాయలు కూడా థైరాయిడ్ ఉన్నవారికి హాని కలిగించవచ్చు. బరువు పెరగకుండా ఉండాలన్నా, హార్మోన్ల సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలన్నా మీరు కొన్ని పదార్థాలకు దూరంగా ఉండటం తప్పనిసరి. మెడ భాగంలో ఉండే థైరాయిడ్ గ్రంథి విడుదల చేసే •3, •4 హార్మోన్లు మన శరీర శక్తిని, బరువును నియంత్రిస్తాయి. ఈ గ్రంథి పనితీరులో తేడా వస్తే హైపోథైరాయిడిజం (తక్కువ హార్మోన్లు) లేదా హైపర్ థైరాయిడిజం (ఎక్కువ హార్మోన్లు) వంటి సమస్యలు వస్తాయి. ఈ రెండు పరిస్థితుల్లోనూ ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. రెడ్ మీట్: థైరాయిడ్ రోగులు రెడ్ మీట్‌కు దూరంగా ఉండటం మంచిది. దీనిలోని కొలెస్ట్రాల్, శాచురేటెడ్ ఫ్యాట్స్ వల్ల



బరువు వేగంగా పెరుగుతారు. ఇప్పటికే థైరాయిడ్ వల్ల బరువు పెరిగే సమస్య ఉన్నవారికి ఇది మరింత ఇబ్బంది కలిగిస్తుంది. జంక్ ఫుడ్: నూనెలో వేయించిన పదార్థాలు, అతిగా కారం ఉన్న జంక్ ఫుడ్స్ హార్మోన్ల అసమతుల్యతను పెంచుతాయి. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ పెరగడానికి కారణమవుతాయి. గ్లూటెన్ ఆహారాలు: గోధుమలు, మైదా, ఓట్స్‌లో ఉండే గ్లూటెన్ వల్ల థైరాయిడ్ రోగుల్లో రక్తపోటు, మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. వీటి వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించడం శ్రేయస్కరం. కెఫిన్ - ఆల్కహాల్: అధికంగా టీ, కాఫీలు తాగడం లేదా మద్యం సేవించడం వల్ల థైరాయిడ్ గ్రంథి పనితీరు మందగిస్తుంది. అంతేకాకుండా మీరు వాడే మందుల ప్రభావాన్ని కూడా ఇవి తగ్గిస్తాయి. కొన్ని కూరగాయలు - సోయా: క్యాబేజీ, కాలీఫ్లవర్, ముల్లంగి వంటి కూరగాయలు థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిలో ఆటంకం కలిగిస్తాయి. అలాగే సోయా ఉత్పత్తులు కూడా హార్మోన్ల పక్రియపై ప్రభావం చూపుతాయి. డాక్టర్ సలహా లేకుండా వీటిని ఆహారంలో చేర్చుకోకపోవడం ఉత్తమం.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in